# మనిషి-మమత

జి.సి.జీవి

"లోపలికి రావచ్చా?"

"వద్దంటే తిరిగి వెళ్ళిపోతావా?"

ఆమె నవ్వింది. ఆ నవ్వులో జీవం లేదు.

"ఆ మాట మీరు అనరని, అనలేరని నాకు తెలుసు"

"ఎందుకని?"

"ఎంతయినా పదేళ్ళు ఈ ఇంట్లో మీతో కాపురం చేసినదాన్ని. ఆ మాత్రం తెలుసుకోలేనా?"

కాసేపు అతనేమీ మాట్లాడలేదు.

"నిన్నిప్పుడు లోపలికి రానియ్యకపోతే తిరిగి అతని దగ్గరికే వెళ్ళిపోతావా?"

"ఉహూ" తల అడ్డంగా వూపింది.

"ఏం నిన్నాదిలేసి వెళ్ళిపోయాడా?"

"అవును"

"నీలాంటి మరో ఆడదాన్ని లేవదీసుకునేవా?"

"కాదు... ఒంటరిగానే"

"ఒంటరిగానా? ఎక్కడికి?"

"మరో లోకానికి" ఒక్క క్షణం ఆగి చెప్పింది. కట్టలు తెంచుకున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నంలో పమిట చెంగును నోట్లో కుక్కుకుంది.

కొద్ది క్షణాలు స్థాణువై నిలబడిపోయాడతను.

"లోపలికిరా" పక్కకి తొలగి దారి ఇచ్చాడు.

హాల్లోకొచ్చి చుట్టూ ఒకసారి పరికించి చూసింది. ఈ పదేళ్ళలో ఆ ఇంట్లో జరిగిన మార్పుల్ని గమనిస్తూ... అప్రయత్నంగా ఆమె చూపులు మేడమీద ఆ పడగ్గది మీద నిలిచాయి. ఆ గదికి తాళం వేసి వుంది. తను స్వయంగా ఎంబ్రాయిడరీ చేసి కుట్టిన, తన కెంతో ఇష్టమైన మేఘాల నీలితెర ఆ గది గుమ్మానికి వేలాడడం లేదిప్పుడు.

అసలు ఏ తెరా లేదిప్పుడు ఆ గది గుమ్మానికి.

"కూర్చో" సోఫా చూపించాడు.

"మన అమ్మాయి..."

"ఇంకా గుర్తుందా నీకు" అనుకున్నాడు మనసులోనే.

"ఫ్రెండ్సుతో పిక్నిక్‌కి వెళ్ళింది. ఈ రాత్రికి రావొచ్చు"

"అమ్మాయిని చూడాలని వుంది". ఫోటో కోసం హాలంతా వెదికాయి ఆమె చూపులు. అతను గమనించేడు. "మేడ మీద నా గదిలో వుంది అమ్మాయి ఫోటో. చూస్తావా?" మౌనంగా అతని వెనకే మేడ మెట్లెక్కింది ఆమె. ఆ బెడ్ రూం ముందు నుంచి నడుస్తున్నప్పుడు అప్రయత్నంగా ఆగిపోయాయి ఆమె పాదాలు.

అతను వెనక్కి తిరిగి చూశాడు. ఆమె అక్కడే నిలబడి వుంది.

"నువ్వు వెళ్ళిపోయిం తరువాత మేం ఎవ్వరం ఆ గదిలోకి వెళ్ళలేదు. ఈ పదేళ్ళుగా అలా తాళం వేసే వుంది."

ఆమెలో గత దినాల జ్ఞాపకాలు, అనుభూతుల నీడలు కదిలి కొద్ది క్షణాలు కలవర పరిచినాయి.

"లోపలికి వెళ్ళాలని వుందా? తలుపులు తెరవమంటావా?"

"ఒద్దు. ఆ గది నిండా దుమ్ము, బూజు పేరుకుని వుంటుంది" అని ముందుకి కదిలింది ఆమె.

వరండా మలుపు తిరిగి తన గదిలోకి ప్రవేశించాడు అతను.

"రా. ఇదే నా బెడ్‌రూమ్ ఇప్పుడు"

లోపలికి ప్రవేశిస్తున్నప్పుడు ఆమె కాళ్ళు సన్నగా వొణికాయి.

మంచం పక్కనే టేబిల్. దాని మీద ఖరీదైన స్టీల్ ఫ్రేములో పదహారేళ్ళ అమ్మాయి ఫోటో. అందంగా హాయిగా నవ్వుతోంది అమ్మాయి ఫోటోలో.

ఫోటోని చేతిలోకి తీసుకుని కాసేపు కన్నార్పకుండా చూస్తుండి పోయింది ఆమె. చూసిపోని మమతలు, స్మృతులు అలలై, సెగలై ఎగసిపడి, కమ్ముకుని ఆమెని ఉక్కిరి బిక్కిరి చేసినాయ్. సంతోషం, దుఃఖం, ఆవేదన ముప్పిరిగొనగా వెక్కి వెక్కి ఏడుస్తూ మంచం మీద వాలిపోయి దిండ్లలో ముఖం దాచుకుంది.

ఆమె భుజాల ఎగిసెగిసి పడుతున్నాయి. ఆమెని ఓదార్చాలనే కోరికను బలవంతాన అణుచుకుని కాఫీ కలుపుకురావడానికి వెళ్ళాడు అతను.

ఎంత వేదనని దాచుకుని, ఇంకెంత అవమానాన్ని ఎదురు చూసి వచ్చిందో, అతను కాఫీ కప్పుతో తిరిగి వచ్చేసరికి మంచం మీద బోర్లా సొమ్మసిలినట్లు పడుకుని నిద్రపోతూ కనిపించింది ఆమె.

ఒక్క క్షణం అతని గుండెల్లో ఏదో కదిలి కలుక్కుమన్నట్లుగా అయింది.

మెల్లగా ఆ గదిల్లోంచి బైటకు నడిచాడు.

"అమ్మని చూశావా అమ్మా?"

"చూశాను నాన్నా?"

ఆ తరువాత కూతురు ఇంకా ఏమి చెపుతుందోనని ఎదురు చూసిన అతనికి నిరాశే కలిగింది. పదేళ్ళ తర్వాత తల్లిని చూసిన ఆ పదహారేళ్ళ అమ్మాయిలో కనిపించే ఆ నిర్లిప్తత అతడ్ని కలవర పరిచింది.

ఈ పిల్లకి అనుభూతులు లేవా? రక్త సంబంధం ఈమెలో ఎటువంటి స్పందనని కలిగించడం లేదా?

"అమ్మని లేపమంటావా అమ్మా?"

"అవసరం లేదు నాన్నా"

వింతగా చూశాడు కూతురి కళ్ళలోకి. ఆ కళ్ళలో ఏ భావాలు కదులుతున్నాయో అతనికి అర్థం కాలేదు.

ఆమె చూపులు తిప్పుకుని ఎక్కడో చూస్తోంది.

"మాట్లాడాలని లేదా అమ్మతో?"

"లేదు నాన్నా"

"అమ్మ ఇప్పుడెందుకు వచ్చిందో తెలుసా?"

ఆ అమ్మాయి 'ఎందుకు'? అని అడగలేదు.

"అతను చనిపోయాట్ట" కొద్ది క్షణాలాగి అన్నాడు. గిరుక్కున తిరిగి తండ్రికేసి చూసింది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. గడియారం ఒక గంట కొట్టింది. దూరంగా రోడ్డు కవతల మైదానంలోంచి కుక్క మొరిగే శబ్దం వుండి వుండి వినబడుతోంది.

"ఆమె ఇక్కడే వుండిపోతాను అంటే ఏం చెప్పమంటావు తల్లీ?"

తండ్రి కళ్ళల్లోకి సూటిగా వింతగా చూసింది.

"ఏం చెప్పాలనుకుంటున్నారు నాన్నా?"

"నీ అభిప్రాయం చెప్పమ్మా"

"నా కిష్టం లేదు నాన్నా" అని లేచివెళ్ళి బాల్కనీ గ్రిల్ కానుకుని నిలబడి చీకట్లోకి చూడసాగింది.

"అమ్మతో వుండాలని లేదా నీకు?" తండ్రి గొంతులోని మార్పుని ఆమె గమనించక పోలేదు.

"ఈ పదేళ్ళూ ఆమె లేకుండా పెరగలేదా నేను నాన్నా?"

ఆ తరువాత ఏం మాట్లాడాలో తోచలేదు అతనికి.

"చాలా రాత్రయింది. వెళ్ళి పడుకుంటాను నాన్నా" అని అక్కడ్నుంచి కదిలి తన గదిలోకి వెళ్ళి పోయింది ఆ అమ్మాయి.

ఇంకా తెల్లవారలేదు.

బాల్కనీలోంచి సన్నగా లోపలికి మంచు కురుస్తున్నది. అయినా అతనికి చలి అనిపించటం లేదు. అతని ముందున్న టీపాయ్ మీద సగం ఖాళీ అయిన విస్కీ



బాటిలుంది. ఆ మసక చీకట్లో కూడా అతని కళ్ళలో ఎరుపు జీరలు కనిపిస్తున్నాయి.

విస్కీని గ్లాసులోకి వొంపుకుని నీళ్ళు కలపకుండానే గ్లాసందుకుని, పెదాలకి ఆనించుకోబోయాడు. వెనక నుంచి ఒక లేత హస్తం అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

ఆ చేతి స్పర్శ అతనికి వెచ్చగా తగిలింది.

వెనక్కి తిరిగి చూశాడు.

"రాత్రంతా తాగుతూ కూర్చున్నావా నాన్నా?" ఆమె గొంతు సన్నగా వొణికింది.

"అవునమ్మా. నీకూ నిద్ర పట్టలేదా తల్లీ?"

"పట్టింది నాన్నా. ఏదో పీడకలొచ్చి ఇప్పుడే లేచాను" మెల్లగా అతని చేతిలోని గ్లాసు తీసి కింద పెట్టింది.

"తాగింది చాలు నాన్నా. లేచి రండి పడుకుందురుగాని"

"ఒద్దమ్మా. నువ్వెళ్ళు. నేను మరి కాసేపాగి వస్తాను" కిందికి వంగి గ్లాసందుకోబోయాడు.

"ఎప్పుడు? ఈ బాటిల్, మరో విస్కీ బాటిల్ ఖాళీ చేశాకనా?" ఆమె కంఠంలో మందలింపు, బాధ, కోపం.

"ప్లీజ్! నన్నాపకు. ఈ ఒక్క రోజు... ఈ ఒక్క రోజు... నన్ను కంట్రోల్ చెయ్యడానికి ప్రయత్నించకు"

"వీల్లేదు నాన్నా"

"వీల్లేదూ!"

అతను కోపంగా లేచాడు. తూలుతూ కూతురి భుజాల మీద కర్కశంగా చేతులు వేసి అదిమాడు.

"అయితే ఇది చెప్పు. అమ్మ నాతో వుండడం నిజంగా నీ కిష్టం లేదా? ఎందుకు? నీ లేత హృదయంలో ఇంతటి కర్కశత్వం ఎలా పేరుకుంది చెప్పు?" అతను నిలబడలేక కుర్చీలో కూలబడి పోయాడు.

వెక్కిళ్ళు పెడుతూ తన గదిలోకి పరిగెట్టి తలుపేసేసుకుంది ఆ అమ్మాయి.

కాసేపటికి అతను తేరుకున్నాడు.

తొలి పొద్దు చీకట్లింకా విడిపోలేదు.

అతను లేచాడు. మెల్లగా అడుగులు తడబడుతూ తన గదిలోకి నడిచాడు. మంచం కేసి చూసి నివ్వెర పోయాడు

కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు.

మంచం మీద ఆమె లేదు!

స్టీల్ ఫ్రేములో అమ్మాయి ఫోటో కింద మడిచి పెట్టిన వుత్తరం ఫాను గాలికి రెపరెపలాడుతూ కనిపించింది.

తనకి బాగా పరిచయమైన ముత్యాల వంటి అక్షరాలు

-

-"రాత్రి అమ్మాయిని తనివి తీరా చూసుకున్నాను. నేనూహించినట్టే అందంగా పెరిగింది. అమ్మాయి మాటలు కూడా విన్నాను. నా పట్ల కాఠిన్యం ధ్వనించినా ఎంత శ్రావ్యంగా వుంది ఆ కంఠం! అమ్మాయి మాటలకి నాకు కోపం రాలేదు. ఇంత లేత ప్రాయంలో ఆమె సంతరించుకున్న వ్యక్తిత్వానికి, నిష్కపటమైన మనస్తత్వానికి నాకు నిజంగా ముచ్చట వేసింది.

నా దొక్కటే చివరి కోరిక. మన అమ్మాయి పెళ్ళికి నాకు శుభలేఖ పంపుతారు కదూ! దూరంగా నిలబడి చూసి వెళ్ళిపోతాను.

నన్ను లోపలికి పిలిచి ఈ మాత్రం ఆదరించి అభిమానం కనబరిచినందుకు సర్వదా కృతజ్ఞురాలిని. వెళుతున్నాను. సెలవ్'-

అతను గబగబ బాల్కనీలోకి వచ్చాడు. కాంపౌండు గేటు కవతల దూరంగా రోడ్డు మలుపు తిరుగుతూన్న ఆకారం మసక మసకగా కనిపించింది.

* * *

సాయంకాలం ప్రారంభమైన వర్షం ఇంకా చిటచిట మని పడుతూనే వుంది.

"చీకట్లో కూర్చుని వున్నావేం అమ్మా లైటైనా వేసుకోకుండా?"

ఉలిక్కిపడి తిరిగి చూసింది.

"వచ్చారా నాన్నా! ఇప్పుడే కరెంటు పోయింది. వుండండి కేండిల్ వెలిగించి తెస్తాను"

హాల్లోంచి పక్క గదిలోకి నడిచింది. కేండిల్ వెలిగించి తెచ్చింది.

"వర్షంలో బాగా తడిసినట్టున్నారు. రండి నాన్నా గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుందురుగాని"

కూతురి వెనకే మెట్లెక్కి గదిలోకి వెళ్ళిన అతను నిశ్చేష్టుడై నిలబడి పోయాడు.

మంచం మీద ఆమె... అవును... ఆమె కూర్చుని వుంది!

అతడ్ని చూసి లేచి నుంచుంది.

వెనక్కి తిరిగి కూతురి కేసి చూశాడు. అతని కళ్ళలో కదలాడిన ప్రశ్న ఆమెకి వినిపించింది.

"ఆమె లేకుండా నేనుండగలను నాన్నా. కాని... కాని ... మీరు లేకుండా నేనుండలేను. అందుకే... అందుకే... ఆమెని తీసుకొచ్చాను"

అని గిరుక్కున వెనక్కి తిరిగి కన్నీటిని దాచుకుంది ఆ అమ్మాయి.

టప్పున లైట్లు వెలిగాయి. ●

